కాంగ్రెస్ అప్పు.. లక్షన్నర కోట్లు

- అప్పులు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ సరికొత్త రికార్డు
- కార్పొరేషన్ల లోన్లు కూడా కలిపితే ఇంకా చాలా ఎక్కువ
- ఎఫ్ఆర్బీఎం పరిధిని దాటిమరీ రుణ సేకరణ
- రాష్ట్రంపై నెలకు రూ.10వేల కోట్లకుపైగా పడిన భారం
- అప్పులతో ఒక్క ప్రాజెక్టునూ చేపట్టని ప్రభుత్వం తీరు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సగటున రోజుకు రూ.333 కోట్ల చొప్పున ప్రజలపై అప్పులభారం మోపుతున్నది. గత 15 నెలల కాలంలో నెలకు సుమారు రూ.10వేల కోట్ల చొప్పున ఇప్పటికి రూ.1,52,918 కోట్ల అప్పు చేసింది.



హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): అసమర్థ పాలన, అర్థరహిత విధానాలతో ఇప్పటికే అనేక 'రికార్డులు' మూటగట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. నేడు మరో కొత్త రికార్డు సృష్టించనున్నది. అదేదో ప్రజలకు మంచి చేసే విషయంలో కాదు.. అప్పులు తీసుకోవడంలో రికార్డు సాధించనుంది. ఆర్బీఐ నుంచి మంగళవారం బాండ్ల వేలం ద్వారా రూ.3వేల కోట్ల మేర అప్పులు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం గత 15 నెలల్లో అధికారికంగా చేసిన అప్పులు లక్షన్నర కోట్లు దాటనున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 460 రోజుల పాలనలో చేసిన అప్పు అక్షరాల రూ.1,52,918 కోట్లకు చేరుకోనున్నది. అంటే.. నెలకు రాష్ట్ర ప్రజలపై రూ.10వేల కోట్లకుపైగా అప్పుల భారం మోపుతున్నదన్న మాట. గత నాలుగు నెలల్లో కార్పొరేషన్ల ద్వారా సేకరించిన రుణాలు కూడా కలిపితే ఈ మొత్తం మరింత పెరుగుతుందని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు.

మొదటి రోజు నుంచీ అప్పులే..

కాంగ్రెస్ ప్రభుత్వం 2023 డిసెంబర్ 7వ తేదీ నుంచి అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందంటూ ఎన్నికల సమయంలో విమర్శించిన కాంగ్రెస్.. తాము అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే అప్పులు చేయడం మొదలు పెట్టింది. అవకాశం ఉన్న ప్రతిచోట ఎడాపెడా అప్పులు చేస్తూ ప్రజలపై భారం మోపుతూనే ఉన్నది. ఓవైపు ఆర్బీఐ నుంచి బాండ్ల ద్వారా రుణాలు సేకరిస్తూ, మరోవైపు కార్పొరేషన్ల ద్వారా కూడా అప్పులు చేస్తున్నది. ఇంకోవైపు భూములు తనఖా పెడుతూ రూ.వేల కోట్లు సేకరిస్తున్నది.

2023 డిసెంబర్ నుంచి నేటివరకు ప్రభుత్వం ఆర్బీఐ నుంచి రూ.69,827 కోట్ల రుణాలు సమీకరించింది

- ప్రభుత్వం అధికారికంగా వెల్లడించిన గణాంకాల ప్రకారమే.. ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా నిరుడు నవంబర్ వరకు కార్పొరేషన్లు/ఎస్‌పీవీల ద్వారా రూ.61,991 కోట్లు అప్పు తీసుకున్నది.
- ఎలాంటి గ్యారెంటీలు ఇవ్వకుండా రూ.10,100 కోట్ల రుణాలు సేకరించింది.
- నిరుడు డిసెంబర్‌లో టీజీఐఐసీ భూములను కుదువ పెట్టి ఐసీఐసీఐ బ్యాంకు నుంచి రూ.10 వేల కోట్లు పొందింది.
- ఇటీవలే హడ్కో నుంచి రూ.వెయ్యి కోట్లు రుణం తీసుకున్నది.
- ఇవన్నీ కలిపితే అధికారికంగా ఇప్పటివరకు చేసిన అప్పులే రూ.1,52,918 కోట్లకు చేరుకోనున్నాయి.
- నిరుడు డిసెంబర్ నుంచి ఇప్పటివరకు నాలుగు నెలల్లో కార్పొరేషన్ల ద్వారా సేకరించిన రుణాలు కలిపితే ఈ మొత్తం ఇంకా పెరుగుతుందని ఆర్థిక శాఖ వర్గాలు తెలిపాయి.
- అధికారిక గణాంకాలు పరిశీలించినా.. 15 నెలలుగా ప్రభుత్వం సగటున నెలకు చేసిన అప్పు రూ.10వేల కోట్లకుపైనే.
- ఈ లెక్కన 459 రోజుల్లో రోజుకు సగటున రూ.333 కోట్లకుపైగా అప్పు చేసిందని విశ్లేషకులు చెప్తున్నారు.

ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని దాటి రుణాలు

కేంద్ర ప్రభుత్వం విధించిన ఎఫ్ఆర్‌బీఎం పరిధిని దాటి రాష్ట్ర సర్కారు అప్పులు చేసింది. వాస్తవానికి 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని కేంద్ర ప్రభుత్వం రూ.49,255 కోట్లుగా విధించింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తొలి మూడు త్రైమాసికాల్లో (నిరుడు ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు) రూ.41,759 కోట్ల రుణం తీసుకున్నది. అంటే.. కేంద్రం అనుమతించిన అప్పులో జనవరి నాటికి ఇంకా రూ.7,500 కోట్లు మాత్రమే మిగిలింది. కానీ ప్రభుత్వం ప్రస్తుత చివరి త్రైమాసికంలో (జనవరి, ఫిబ్రవరి, మార్చిల్లో) ఏకంగా రూ.30 వేల కోట్ల అప్పు తీసుకుంటామని ఆర్బీఐకి ఇండెంట్లు పెట్టింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అడిగినంత అదనపు రుణం ఇచ్చేందుకు కేంద్రం నిరాకరించింది. ఫలితంగా కొన్ని వారాలపాటు ఆర్బీఐ బాండ్ల వేలంలో తెలంగాణ పాల్గొనలేదు. చివరగా ప్రభుత్వ పెద్దలు ఢిల్లీకి వెళ్లి కేంద్ర పెద్దలను కోరడంతో కొంత ఉపశమనం కల్పించినట్టు చెప్తున్నారు. దీంతో ఇప్పటికే ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని దాటి ఆర్బీఐ నుంచి రూ.20 వేల కోట్లు అదనంగా అప్పు చేశారు. మరో రెండు వారాల్లో ఇంకా ఎంత అప్పు చేస్తారోనని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏం సాధించినట్టు?

రాష్ట్ర ప్రభుత్వం చేసిన లక్షన్నర కోట్లతో ఏం చేసిందనేది ప్రశ్నార్థకంగా మారిందని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. గత 15 నెలల్లో ఒక్క భారీ ప్రాజెక్టునైనా చేపట్టిందా? అని ప్రశ్నిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులతో కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి వంటి భారీ సాగునీటి ప్రాజెక్టులు, భారీ భవనాలు, కాలేజీలు.. ఇలా అనేక ఆస్తులు సృష్టించిందని గుర్తు చేస్తున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రూ.లక్షన్నర కోట్ల రుణంతో రాష్ట్రానికి సృష్టించిన ఆస్తి ఒక్కటి కూడా లేదని మండిపడుతున్నారు. పోనీ సంక్షేమ పథకాలైనా సక్రమంగా అమలవుతున్నాయా? అంటే అదీ లేదని చెప్తున్నారు. కనీసం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేని పరిస్థితిలో ఉన్నారని మండిపడుతున్నారు.

2023 డిసెంబర్ నుంచి మంగళ వారం వరకు అప్పులు ఇలా..

- ఆర్బీఐ నుంచి తీసుకున్నవి - రూ.**69,827** కోట్లు
- కార్పొరేషన్లు/ఎస్‌పీవీల ద్వారా సేకరించినవి - రూ.**61,991** కోట్లు (గత నవంబర్ నాటికి)
- గ్యారెంటీలు ఇవ్వకుండా సమీకరించినవి - రూ.**10,100** కోట్లు
- టీజీఐఐసీ భూములను కుదువ పెట్టి తీసుకున్నవి - రూ.**10** వేల కోట్లు
- హడ్కో నుంచి తీసుకున్న రుణం - రూ.వెయ్యి కోట్లు
- మొత్తం అప్పు - రూ.**1,52,918** కోట్లు

పేపర్లు దిద్దిన టీచర్లకూ పెండింగే!

- పదోతరగతి జవాబు పత్రాలు మూల్యాంకనం చేసిన టీచర్లు
- ఏడాది గడిచిప్పటికీ పైసలు ఇవ్వని విద్యాశాఖవర్గాలు
- బకాయి ఇస్తారో, ఎగ్గొడతారో సర్కారు చెప్పాలి: టీఆర్‌టీఎఫ్

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): నిధుల కొరత అంటూ సంక్షేమాన్ని, అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్న సర్కారు ఆఖరికి టీచర్లకు కూడా బకాయిలు చెల్లించడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిరుడు పదోతరగతి వార్షిక పరీక్షల జవాబు పత్రాలు మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు పారితోషికం చెల్లించలేదని మండిపడుతున్నారు. ఏడాది గడిచినా ప్రభుత్వం రూ.20 కోట్లు ఇవ్వడానికి వెనుకాడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మళ్లీ పదోతరగతి పరీక్షలు వస్తున్నాయని, ఈ ఏడాదైనా ఇస్తారో, ఎగనామం పెడుతారో అర్థం కావడంలేదని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కటకం రమేశ్, ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. బకాయిల కోసం 20 వేల మంది ఉపాధ్యాయులు నిరీక్షిస్తున్నారని చెప్పారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం ఇప్పటికే వివిధ బకాయిల కింద మొత్తం రూ.80 కోట్లు చెల్లించాల్సి ఉన్నదని తెలిపారు. వెంటనే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రైల్వే బోర్డు చైర్మన్‌తో ఎంపీ వద్దిరాజు భేటీ

సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేత

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సోమవారం ఢిల్లీలోని రైల్ నిలయంలో రైల్వేబోర్డు చైర్మన్ సతీశ్‌కుమార్‌తో భేటీ అయ్యారు. ఖమ్మం జిల్లాలో రైల్వేస్టేషన్ల ఆధునీకరణ, కొత్త ప్లాట్‌ఫారాల ఏర్పాటు, కొవిడ్‌కు ముందు రద్దుచేసిన రైళ్ల పునరుద్ధరణ, అదనపు హాల్టింగ్ పాయింట్లు, కొత్త రైల్వే సర్వీసుల ప్రారంభం తదితర సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని చైర్మన్ హామీ ఇచ్చారని వద్దిరాజు వెల్లడించారు.

తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో మాజీ ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు

అప్పులు తెచ్చి ఏం ఉద్ధరించారు?

- ఒక్క ప్రాజెక్టు కట్టలేదు.. మంచి పథకం తెచ్చింది లేదు
- దరిద్రం రేవంత్ మాటల్లో ఉంది.. తెలంగాణలో కాదు
- రాష్ట్రం దివాలా తీసిందని మన గౌరవాన్ని గంగలో కలిపారు
- బడా కాంట్రాక్టర్ల జేబులు నింపి బడుగుల పొట్టగొట్టారు
- రాష్ట్ర ప్రభుత్వంపై ఎమ్మెల్సీ కవిత ఫైర్

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి 15 నెలల పాలనలో రూ.1.52 లక్షల కోట్ల అప్పులు తెచ్చారే తప్ప తెలంగాణను ఉద్ధరించిందేమీలేదని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. 'ఒక్క పెద్ద ప్రాజెక్టు కట్టలేదు.. మంచి పథకాన్ని ప్రారంభించింది లేదు.. కనీసం ఒక్క మహిళకు కూడా 2500 చొప్పున ఇవ్వలేదు' అని నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి ఢిల్లీలో కూర్చొని రాష్ట్రం దివాలా తీసిందని మాట్లాడి పరువుతీశారని మండిపడ్డారు. 'గులాబీ కండువా నీడలో పేగులు తెగేదాకా కొట్లాడి.. జనమంతా ఏకమై బోనాలు మోసి.. బతుకమ్మలు ఎత్తి.. ఊరూరా నిరాహారదీక్షలు చేసి తెచ్చుకున్న తెలంగాణను.. ఉద్యమంతో సంబంధంలేదని రేవంత్‌రెడ్డి అవమానిస్తే సహించబోం' అని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమకారులపై గన్నుపట్టుకొని ఎదురుతిరిగిన వ్యక్తి మన ముఖ్యమంత్రిగా ఉండటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. తెలంగాణభవన్‌లో సోమవారం మాజీ ఎంపీ మాలోతు కవిత, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, సుమిత్రా ఆనంద్, ఆలకుంట హరి, దత్తాత్రేయతో కలిసి కవిత విలేకరులతో మాట్లాడారు. 'మా తెలంగాణ గొప్పగా ఉన్నది.. దేశంలో నంబర్ వన్‌గా ఉన్నది..' అంటూ కేసీఆర్ అటు ఢిల్లీతోపాటు దేశవిదేశాల్లో గొప్పగా చెప్పిన్రు.. పదేండ్లు కష్టపడి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన్రు..' అని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఢిల్లీకి వెళ్లి రాష్ట్రం అప్పుల పాలైందని, అభివృద్ధికి నెలకు రూ.500 కోట్లు కూడా వెచ్చించలేని పరిస్థితి ఉన్నదని చెప్పి దేశస్థాయిలో మన గౌరవాన్ని గంగలో కలిపారని విమర్శించారు. దరిద్రం ఆయన ఆలోచనలో ఉన్నది తప్ప తెలంగాణలో లేదని దెప్పిపొడిచారు.

అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

కాంగ్రెస్ 15 నెలల పాలనలో సగటున నెలకు రూ. 10 వేల కోట్ల చొప్పున రూ. 1.52 లక్షల కోట్లు అప్పులు చేశారని కవిత ఆరోపించారు. పరిస్థితి చూస్తుంటే మరో 35 నెలల్లో మరో రూ. 3.5 లక్షల కోట్లు అప్పులు చేసేటట్టు ఉన్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పదేండ్లలో రూ.4.38 లక్షల కోట్ల అప్పులు తెచ్చి రూ.50 లక్షల కోట్ల విలువైన ఆస్తులు సృష్టించడమే గాకుండా నిరాటకంగా సంక్షేమాన్ని కొనసాగించారని చెప్పారు. ఇందుకు కళ్లెదుట కనిపిస్తున్న ప్రాజెక్టులే నిదర్శనమని అన్నారు. కాళేశ్వరానికి రూ.90 వేల కోట్లు, నీటిపారుదల ప్రాజెక్టులకు రూ.1.35 లక్షల కోట్లు, మిషన్ భగీరథకు రూ.37 వేల కోట్లు, రుణమాఫీకి రూ.30 వేల కోట్లు, ఉచిత కరెంట్‌కు రూ.36 వేల కోట్లు, రైతుబంధుకు రూ.73 వేల కోట్లు, రైతుబీమాకు రూ.6,800 కోట్లు, విద్యుత్తు రంగంపై రూ.1.38లక్షల కోట్లు, ఆరోగ్య రంగంపై రూ.61 వేల కోట్లు, సంక్షేమానికి రూ.2.83 లక్షల కోట్లు ఖర్చుచేశారని సోదాహరణంగా వివరించారు. కానీ రేవంత్‌రెడ్డి అప్పులపై తప్పుడు లెక్కలు చెప్తున్నారని మండిపడ్డారు. పొద్దున లేస్తే కేసీఆర్‌ను బద్నాం చేస్తున్నారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి బడా కాంట్రాక్టర్ల జేబులు నింపి బడుగుల పొట్టగొట్టారని ఆరోపించారు. నిజంగా ఆయనకు చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర అప్పులపై వచ్చే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనైనా స్పష్టత ఇవ్వాలి లేదంటే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రేవంత్‌కు సబ్జెక్ట్‌లేదు..ఆబ్జెక్ట్ లేదు..

'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సామాజిక దృక్పథం లేదు. ఆర్థిక క్రమశిక్షణ లేదు.. వాగ్దానాలు నిలబెట్టుకోవాలనే నియ్యత్ లేదు.. భవిష్యత్‌పై దూరదృష్టి లేదు.. పేదవాడి కడుపు నింపాలనే ఆలోచన లేదు.. ఒక్క మాటలో చెప్పాలంటే సబ్జెక్ట్ లేదు..ఆబ్జెక్ట్ లేదు' అంటూ కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భజభజ మానం భజగోవిందం అన్నచందంగా రాష్ట్రంలో పరిస్థితి ఉన్నదని అన్నారు. 'అడిగిన వారికి బెదిరింపులు.. ప్రశ్నిస్తే బుకాయింపులు.. భూములివ్వబోమన్న రైతులకు బేడీ లు.. కేసీఆర్‌పై నిత్యం చాడీలు' తప్ప 15 నెల ల్లో సాధించేందేమీలేదని విమర్శించారు. కేసీఆర్ ఆత్మగౌరవంతో కూడిన అభివృద్ధి చేస్తే రేవంత్ మాత్రం నయవంచనతో నమ్మించి మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అవగాహన లేకుంటే తెలుసుకోండి..

ముఖ్యమంత్రికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి అవగాహన లేకుంటే నిపుణులను అడిగి తెలుసుకోవాలని, అంతే గాని అబద్ధాలు చెప్పవద్దని కవిత చురకలంటించారు. ఒక పక్క అభివృద్ధి పనులకు రూ.500 కోట్లు కూడా మిగలడం లేదని చెప్తూనే మరోపక్క మా పోటీ న్యూఢిల్లీతో కాదు.. న్యూయార్క్‌తోనే అనడం ఆయనకే చెల్లిందని అన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి తెలంగాణను అవమానించకుండా నిలబెడితే ప్రతిపక్షంగా అండగా ఉంటామని ప్రకటించారు. జిల్లా సమాఖ్యలకు బస్సులు అప్పజెప్పి మహిళా సంఘాలందరికీ ఇచ్చినట్టు పోజులు కొట్టడం విడ్డూరమని అన్నారు. దీనిద్వారా వచ్చే ఆదాయం మహిళలకు తలా ఒక్కరూపాయి కూడా అందదని చెప్పారు. మహిళా బిల్లు ఆమోదంపై కేంద్రానికి చిత్తశుద్ధి లేదని విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. బీఆర్‌ఎస్ ఒత్తిడితోనే పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశపెట్టారని స్పష్టం చేశారు.

మంచిర్యాలలో రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్‌నాయకులు

జంక్షన్ల కూల్చివేతపై బీఆర్‌ఎస్ ఆగ్రహం

- కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ రాస్తారోకో
- మంచిర్యాలలో ఉద్రిక్తం

మంచిర్యాలటౌన్, మార్చి 10 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తానుంచి లక్ష్మీటాకీసు చౌరస్తా వరకు బీఆర్‌ఎస్ హయాంలో రూ. 4 కోట్లతో నిర్మించిన నాలుగు జంక్షన్‌లను కుదింపు పేరిట కూల్చివేయడంపై బీఆర్‌ఎస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సోమవారం జిల్లా కేంద్రంలో రాస్తారోకో చేపట్టగా పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఆయన తనయుడు విజిత్‌రావుతోపాటు బీఆర్‌ఎస్ నాయకులను పట్టణ సీఐ ప్రమోద్‌రావు పోలీసులతో కలిసి పక్కకు తప్పించేందుకు ప్రయత్నించారు. ఐడీపార్టీ కానిస్టేబుల్ లక్ష్మణ్ విజిత్‌రావును బలవంతంగా పక్కకు తప్పించేందుకు చేసిన ప్రయత్నం ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు విజిత్‌రావును పోలీసు వాహనంలో ఎక్కించడానికి ప్రయత్నించగా బీఆర్‌ఎస్ శ్రేణులు అడ్డుకున్నాయి.

వ్యవసాయ కార్పొరేషన్లకు తిలోదకాలు?

- కార్పొరేషన్ల పనితీరుపై నెల రోజుల్లోగా నివేదిక ఇవ్వండి
- నివేదికల ప్రకారం విలీనమో, బలోపేతమో ఆలోచిద్దాం
- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): వ్యవసాయ అభివృద్ధి, రైతు సంక్షేమం కోసం పనిచేసే కార్పొరేషన్లకు సర్కారు తిలోదకాలు ఇచ్చేందుకు సిద్ధమైందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు సంస్థల పనితీరు, లాభనష్టాలను సాకుగా చూపిస్తూ మూసివేసేందుకు ప్రయత్నిస్తున్నదని రైతు సంఘాల నేతలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. సోమవారం సచివాలయంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్వహించిన సమీక్ష సమావేశం సాగినతీరు ఇందుకు బలం చేకూర్చుతున్నదని చెప్తున్నారు. సమావేశంలో తుమ్మల మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ కార్పొరేషన్లపై నివేదికలు ఇవ్వాలని ఆయా సంస్థల ఎండీలను ఆదేశించారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పనిచేస్తే కార్పొరేషన్ల మనుగడ కొనసాగుతుందని మంత్రి నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో వ్యవసాయాన్ని నిర్వీర్యానికి కుట్రలు పన్నుతున్నదని రైతు సంఘాల నేతలు నిప్పులు చెరుగుతున్నారు.

శ్రీచైతన్య విద్యాసంస్థల్లో ఐటీ సోదాలు

అవకతవకలు జరిగినట్టు గుర్తింపు

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): శ్రీచైతన్య విద్యాసంస్థల్లో ఆదాయ పన్ను (ఐటీ) అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ విద్యాసంస్థల్లో అక్రమ లావాదేవీలు జరిగినట్టు ఆరోపణలు రావడంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు ఢిల్లీ, ముంబై, పుణె, బెంగళూరు నగరాల్లోని శ్రీచైతన్య శాఖల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల నుంచి నగదు రూపంలో ఫీజులు వసూలు చేసి పన్ను ఎగవేతకు పాల్పడినట్టు శ్రీచైతన్య విద్యాసంస్థలపై అభియోగాలు ఉన్నాయి. మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని శ్రీచైతన్య ప్రధాన కార్యాలయంలో కార్పొరేట్ వ్యవహారాలు, విద్యార్థులకు సంబంధించిన లావాదేవీలు జరుగుతున్నాయి. ఇక్కడ దాదాపు 20 మంది ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. విద్యార్థుల నుంచి ఫీజులను వసూలు చేసేందుకు ప్రత్యేకంగా ఓ సాఫ్ట్‌వేర్‌ను, పన్ను ఎగవేతకు మరో సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్నట్టు ఈ సోదాల్లో గుర్తించారు. ఒక్క హైదరాబాద్ కేంద్ర కార్యాలయంలోనే ఐటీ అధికారులు దాదాపు రూ.5 కోట్ల నగదును గుర్తించినట్టు తెలిసింది.

ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో రాజకీయాలు

- రాజకీయ సమావేశాలపై కలెక్టర్‌కు బీఆర్‌ఎస్ నేతల ఫిర్యాదు
- ఎమ్మెల్యే యశస్వినీరెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



ఎమ్మెల్యే యశస్వినీరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

జనగామ చౌరస్తా, మార్చి 10 : పాలకుర్తి ఎమ్మెల్యే ప్రభుత్వ అధికారిక క్యాంప్ కార్యాలయంలో జరుగుతున్న కాంగ్రెస్ రాజకీయ సమావేశాలపై వెంటనే విచారణ చేపట్టాలని సోమవారం జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు బీఆర్‌ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ అసెంబ్లీ కార్యదర్శితో ఈ విషయంపై చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ పుస్కూరి శ్రీనివాసరావు, జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గ ప్రజల కష్ట సుఖాలను ఎమ్మెల్యేలు దగ్గరుండి తెలుసుకోవడానికి, సమస్యలను పరిష్కరించడానికి, అధికారులతో సమీక్ష నిర్వహించడానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలకు అధికారిక క్యాంప్ కార్యాలయాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే యశస్వినీరెడ్డితో పాటు ఆమె అత్త, ఎన్‌ఆర్‌ఐ ఝాన్సీరెడ్డి ఇటీవల అధికారిక క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ సమావేశాలు, చేరికలు రాజకీయాలకు సంబంధించిన మీడియా సమావేశాలు నిర్వహిస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. భారత ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 123 (7) ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించడం నిషేధిమని పేర్కొన్నారు. పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అధికార కార్యాలయంలో జరిగిన ఈ అక్రమ రాజకీయ కార్యకలాపాలపై సమగ్ర విచారణ జరిపి, సంబంధిత ఎమ్మెల్యే యశస్వినీరెడ్డితో పాటు బాధ్యత వహించాల్సిన అధికారులపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాత ప్రాజెక్టుల నిర్వహణపై దృష్టిపెట్టాలి

- ప్రాధాన్యతా క్రమంలో పనులు పూర్తిచేయాలి : భట్టి

హైదరాబాద్, మార్చి10 (నమస్తే తెలంగాణ): పాత ప్రాజెక్టుల నిర్వహణపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, ప్రాధాన్యతా క్రమంలో పనులు పూర్తిచేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆ శాఖ ప్రీ బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో చర్చించారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టును ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని, ఏఎమ్మార్పీలో ఐదో పంపు ఏర్పాటు చేసే పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. సీతారామ, బస్వాపూర్, డిండి తదితర ప్రాజెక్టుల పూర్తిపై దృష్టిపెట్టాలని సూచించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, సాగునీటి పారుదల శాఖ సలహాదారు తదితరులున్నారు.

రేషన్‌డీలర్లకు కమీషన్ పరేషాన్

మొదటిపేజీ తరువాయి...

సంస్థ సుమారు మూడు నెలలుగా కమీషన్ విడుదల చేయడం లేదని తెలిసింది. కమీషన్ ఆదాయంపైనే ఆధారపడిన కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇటీవల మెదక్ జిల్లా రెడ్డిపల్లి గ్రామానికి చెందిన రేషన్ డీలర్ ప్రభాకర్ ఆత్మహత్య చేసుకున్నట్టు రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

70 కోట్ల బకాయిలు

రేషన్ బియ్యం పంపిణీ చేసినందుకు డీలర్లకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.140 చొప్పున కమీషన్ చెల్లిస్తున్నది. రాష్ట్రంలో సుమారు 17,200 మంది రేషన్ డీలర్లు ఉన్నారు. వీరంతా ప్రతి నెలా 1.6 లక్షల టన్నుల బియ్యం పేదలకు పంపిణీ చేస్తారు. ఇందుకుగాను వీరికి ప్రతి నెలా కమీషన్ రూపంలో సుమారు రూ.23 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుంది. అయితే, మూడు నెలలుగా కమీషన్ చెల్లింపుల్లో పౌరసరఫరాల సంస్థ జాప్యం చేస్తున్నట్టు తెలిసింది. దీంతో రేషన్ డీలర్లకు చెల్లించాల్సిన కమీషన్ బకాయిలు రూ.70 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. ఈనెల కూడా పూర్తయితే నాలుగు నెలల బకాయిలు రూ.100 కోట్లకు చేరుతాయని చెప్తున్నారు. కమీషన్ విడుదలలో జాప్యానికి పౌరసరఫరాల సంస్థలోని పలువురు అధికారుల తీరే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కాంగ్రెస్ హామీలు గాలికి..

అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేషన్ డీలర్లపై కాంగ్రెస్ పార్టీ హామీల వర్షం కురిపించింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండేండ్ల క్రితం కమీషన్‌ను 100% పెంచింది. గతంలో కమీషన్ క్వింటాల్‌కు రూ.70 ఉండగా దానిని రూ.140కి పెంచింది. అయితే, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో రేషన్ డీలర్ల కమీషన్‌ను రూ.300కు పెంచుతామని హామీ ఇచ్చింది. దీంతోపాటు ప్రతి నెలా రూ.5వేల గౌరవ వేతనం ఇస్తామంటూ ఆశ పెట్టింది. తీరా అధికారంలోకి కమీషన్ విడుదల చేయడం లేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

గ్రామాన్ని వెంటనే తరలించండి

ఓసీ-3 ప్రాజెక్టు ఎదుట పరశురాంపల్లి గ్రామస్తుల ధర్నా

గణపురం, మార్చి 10: తమ గ్రామాన్ని వెంటనే తరలించాలని, నీళ్లు, పనులు లేక ఆకలితో అల్లాడుతున్నామని జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం పరశురాంపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు. తమకు పునరావాస ప్యాకేజీ అందించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కేటీకే ఓసీ-3 ప్రధాన రహదారిపై టెంట్ వేసుకొని సుమారు ఐదు గంటలపాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పరశురాంపల్లి గ్రామస్తులు మాట్లాడుతూ.. పొలాలు మొత్తం తీసుకొని గ్రామాన్ని తరలించకపోవడంతో పనులు లేక పస్తులు ఉంటున్నామని అన్నారు. సింగరేణి ఓసీ-3 కింద 90% వ్యవసాయ భూములను కోల్పోయామని, ఉపాధి లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. పునరావాస ప్యాకేజీ అందిస్తామని సింగరేణి అధికారులు చెప్పేనే ఎంతో విలువైన పంట భూములను ఇచ్చామని పేర్కొన్నారు.

నెల రోజుల్లో పరిష్కరిస్తాం: జీఎం

ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, అడిషనల్ జీఎం రవీంద్ర అక్కడికి వచ్చారు. సమస్యను నెలరోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

నేడు బీఆర్‌ఎస్‌ఎల్పీ భేటీ

- *బడ్జెట్ సమావేశాలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేయనున్న కేసీఆర్*

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన మంగళవారం తెలంగాణభవన్‌లో పార్టీ శాసనసభాపక్షం సమావేశం జరగనున్నది. బుధవారం నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలతోపాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. బడ్జెట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42% రిజర్వేషన్లపై బిల్లులు ప్రవేశపెట్టాలని ఈ నెల 6న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వాటిపై తీసుకున్న చర్యలపై కేసీఆర్ పార్టీ ప్రజాప్రతినిధులకు వివరించి, అందుకు అనువైన కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నారు. రాష్ట్రంలో వ్యవసాయరంగం, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లే కార్యాచరణ, తదితర అంశాలపై కూడా మార్గనిర్దేశం చేయనున్నారు.

20% కమీషన్‌పై సీఎం గప్‌చుప్

- ఆరోపణలను ఖండించకపోవడంపై చర్చ
- విజయశాంతికి ఎమ్మెల్సీ టికెట్ జరిగిపోయిన అంశమని దాటవేత
- బీసీలకు ఎమ్మెల్సీ సీట్లు తనగొప్పతనంగా చెప్పుకున్న సీఎం
- చిట్‌చాట్‌లో రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి10 (నమస్తే తెలంగాణ): కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం మంత్రులు 20% కమీషన్ తీసుకుంటున్నారనే ఆరోపణలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఖండించకపోవడం చర్చనీయాంశంగా మారింది. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులు నామినేషన్లు సమర్పించిన అనంతరం రేవంత్‌రెడ్డి సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. మంత్రులు 20% కమీషన్ తీసుకొని కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నారనే ఆరోపణలపై విలేకరులు అడిగిన ప్రశ్నకు రేవంత్‌రెడ్డి బదులిస్తూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టు బిల్లులు చెల్లించకపోవడం వల్లనే తాము ఇప్పుడు చెల్లించాల్సి వస్తున్నదని చెప్పారు. కానీ, తమ మంత్రులు 20% కమీషన్లు తీసుకోవడంలేదని మాత్రం ఖండించకపోవడం గమనార్హం. మీరు ఢిల్లీకి ఎక్కే ఫ్లైట్, దిగే ఫ్లైట్‌తోనే సరిపోతున్నదంటూ కేటీఆర్ చేసిన ఆరోపణలను విలేకరులు ప్రస్తావించగా.. రేవంత్‌రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. తాను వచ్చాకే కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వచ్చిందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం 39 సార్లు కాదు అవసరమైతే, 99 సార్లు ఢిల్లీకి వెళ్తామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌తో సంబంధం వల్లే భట్టి విక్రమార్క సమావేశానికి బీజేపీ రాలేదని ఆరోపించారు. బీసీ కులగణనతో సామాజిక న్యాయం జరిగిందని, తాము చేసిన కులగణన వల్లే ఇవాళ అన్నీ పార్టీలు బీసీలకు ఎమ్మెల్సీ సీట్లు ఇచ్చాయని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌లో చేరిన నాటి నుంచి పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్న విజయశాంతికి ఎమ్మెల్సీ టికెట్ ఎలా ఇచ్చారని అడిగిన ప్రశ్నకు రేవంత్‌రెడ్డి ఎలాంటి సమాధానం చెప్పలేకపోయారు. ఆమె పదవి గురించి ఇప్పుడు మాట్లాడాల్సిన అవసరం లేదని దాటవేశారు.

ముఖ్యమంత్రికి జీవన్‌రెడ్డి లేఖ

- పసుపు, మొక్కజొన్న, కంది కొనుగోలు చేయాలని వినతి
- మద్దతు ధర అందక రైతులు నష్టపోతున్నారని ఆవేదన

హైదరాబాద్, మార్చి 10(నమస్తే తెలంగాణ): పంటలకు మద్దతు ధర అందక రైతులు నష్టపోతున్నారని, వెంటనే మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే పంటలు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. పంటల కొనుగోలుపై సొంత పార్టీ ఎమ్మెల్సీ లేఖ రాయడం చర్చనీయాంశమైంది. నిరుడు పసుపు క్వింటాల్‌కు రూ.15వేల ధర పలికితే, ప్రస్తుతం రూ. 8-10 వేలు మాత్రమే పలుకుతుందని పేర్కొన్నారు. రూ.12 వేల మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.2వేలకు పడిపోయిందని, కంది ధర రూ.7550 ఉండగా, మార్కెట్లో రూ. 6500లకే కొనుగోలు చేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు.